# దీపావళి

బావా! నాకు టపాకాలు తెచ్చిపెట్టవూ?' అంది శ్యామి. ఈప్రశ్న నేను వినీవిననట్లు మౌనం నటించాను.

'బావా! నాకు టపాకాలుకావాలి' అని మళ్లీ అందుకుందిశ్యామి. ఈమారుకొంచెంగట్టిగా, తన దృఢ నిశ్చయాన్ని నాకు సుస్పష్టంగా తెలియ జెయ్యాలన్న ఉద్దేశ్యంతో—

విధిలేక ప్రశ్నార్థకంగా 'ఆఁ' అన్నాను.

'నాకూ తపాకాలుకావాలి' అంటూ లోపల్నించి వొచ్చాడుబాబు, నగ్నంగా చొక్కాను అదోవిధంగా వాడు ఆడుకునే బండికీమల్లే లాగుతూ—

క్రిందటి సంవత్సరం మొత్తం అయిదువేల రూపాయిలు ఇంటి ఖర్చుల పైన వ్యయపరచటం వల్ల నిన్ననే ఇంట్లో అందరం కలిసి ఈ మారు దీపావళికి టపాకాలు ఏమీ తీసుకరావద్దని నిశ్చయం చేసుకున్నాము.

అసలు మాకు వొచ్చిన రాబడి గత సంవత్సరం అంతా కలిసి మూడువేలే. అంటే తక్కిన రెండువేలరూపాయిలు నిరుడు మా సంసారానికి అప్పుల క్రింద మిగిలినాయన్నమాట. ఈవిషయం తలుచుకున్నప్పుడల్లా గుండె నీరై పోతుంది.

గొంగడి వున్నంత కాళ్లు జాపమన్నారు పెద్దలు.

పైవిషయాన్ని దృష్టిలో వుంచుకుని మేము ఇంటిల్లి పాదీ దుర్వ్యయాన్ని ఆపేసి, సంవత్సరాంతం వరకూ ఏమీ మిగుల్చుకో లేకపోయినా ఆదాయాన్నిబట్టి వ్యయాన్ని నిర్ణ యించుకొందామన్న ఉద్దేశ్యమే మమ్మల్ని ఈనిశ్చయానికి పురికొల్పింది.

నేనీసంగతి పిల్లలకి ఎల్లా నచ్చచెప్పనూ? వాళ్ల ప్రశ్నా పరంపరలకి నాకేమీ పాలుపోలేదు. మౌనంగా ఎడ తెరిపిలేని ఆలోచనలతో తలపైకెత్తాను.

ఇంతలోకి నారాయణకూడా వీళ్లని చేరుకున్నాడు. నారాయణకి నేనంటే కొద్దిగా భయం. ఏవిషయంలో కూడా వాడు నన్ను ఎదిరించి ఎరుగడు. కాని ఆరోజుమాత్రం వాడి మౌనంచూపుల్లో నాకుఅదేప్రశ్న ద్యోతక మయింది.

నారాయణనూ, శ్యామిని నయానో భయానో వొప్పించగలను కాని బాబు ముందుమాత్రం నా అసమర్థత వెల్లడికాక తప్పదు. వాడిముందు ఏమాటన్నా కష్టమే. 'సరే' టపాకాలు తీసుకొస్తానంటే, ఆక్షణంలో బజారుకు బయల్దే రిందాకా వదలడు.

'తీసుకరానన్నానో' ఇక అంతటితోసరి. ఇల్లంతా వొక యుద్ధ రంగంగా మారివూరుకుంటుంది. వాడిపెంకెతనాన్ని

మే మెవరమూ తట్టుకోలేము సరికదా మళ్ళీవాడ్ని మామూలు మనిషినిచేయడం ఈ జన్మలో మాకుఅలవికాని పని. మా దేశ్ళకూన. ఏమనగలం, మనంవాణ్ని. ఆ శ్రీరాముడి మల్లే వొక మాటు వాడుని ఆకాశంలోణ చంద్రుణి నాకు తెచ్చివ్వ మంటే! మొదట్లో వాడిమాటలు కొంచంసరదాగావున్నా. ఆ రోజు వాణ్ణిసముదాయించి, ఆసంగతి మరిపించేవరకూ మాప్రాణం తోకకు వచ్చింది

ఈవిషమపరిస్థితుల్లోంచి ఎలా తప్పించుకోవటమా అని ఆలోచించాను ఏదోతెచ్చి పెడుతానని చెబితే? అమ్మయ్యో ఆ మరుక్షణంనించీ వాడు నన్ను నిలువనిస్తాడా ఆ ఇంట్లో-

గత్యంతరంలేక 'సాయంత్రం తెచ్చి పెడుతాలే, బాబు' అని బుజ్జగించాను—

"ఇప్పులు కావాలి" అన్నాడు వాడు ధీమగా—

"బాబూ, యిప్పుడు చాలా ఎండగావుంది, కొద్దిగా చల్లపడింతరువాత తెచ్చి పెడుతా" నన్నానుమళ్ళీ—

"యిప్పుడే కావాలి" అన్నాడు బాబు కొంచమైనా వెనక్కి తగ్గకుండా—

"రేపు దీపావళి, ఇప్పటినించే టూపాకాలు ఏంచేస్తా వని" ప్రశ్నించాను—

"నాకు కావాలి, రేపు కాల్చుకోవటానికి" అన్నాడు

ముద్దుగా.

"రేపు కాల్చుకోవటానికైతే ఈ రోజుసాయంత్రిం తెచ్చిపెడతా" నన్నాను.

"కాదు యిప్పుడే కావాలి" అని మొండి కేశాడు.

ఇంతలోకే మాఆవిడ మేము కూర్చున్న గదిలోకి ఏదోపనిమీద వొచ్చింది.

"వీళ్ళు టపాకాలకోసం నన్ను వేధించుకు తింటు న్నారుచూడూ!" అని మాఆవిడతో కొంచం విసుగ్గా అన్నాను.

'రొండురోజుల్నించీ వొకటేగోల. తె చ్చే దే మో తప్పదు. అనవసరంగా ఎందుకొచ్చిన ఆర్భాటం యిదంతా' అంది మాఆవిడ పిల్లల్ని వెనకేసుకుంటూ.

'నువ్వు లక్షచెప్పూ, వెయ్యిచెప్పూ, నేనుమాత్రం ఈ సంవత్సరం టపాకాలు తీసుకురానన్నాను' మాఆవిడకు నా మనోనిశ్చయాన్ని తెలియపరుస్తూ—

'ఎందుకొచ్చిన గొడవ చెప్పండీ, వాళ్ళేమైనా మీ మాట వింటారా'

'వినకుండా ఏంచేస్తారో చూస్తానుగా! వెధవలూ'

పైవాక్యం విన్నదేతడవుగా 'నాకు తపాకాలు కావాలి

నాకు తపాకాలు కావాలి' అంటూ ఏడ్వటం మొదలెట్టాడు బాబు.

'వెధవా! ఎక్కడినించి వస్తాయిరా టపాకాలు అన్నా' ను నేనుకోపంగా.

ఈమాట వినడంతోనే క్రిందపడి గిలగిల తన్నుకోవడం మొదలెట్టాడుబాబు. వాడుఅల్లా క్రిందపడి తన్నుకోవడం చూచి నాకు మరీకోపమెక్కువైంది. వొళ్ళుతెలియకుండా రెండు అటించాను, ఆకోపంలో. దెబ్బలవల్ల వాడికి మరీఏడుపు ఎక్కువైంది. శృతిమించిరాగానపడింది. ఇంక శంకించిలాభం లేదని తెలుసుకొని టపాకాలుతెస్తా' నంటూ బయలుదేరాను బజారుకు. పైమాట అన్నదే తడవుగా బాబు క్రిందినించి దిగ్గునలేచి నాకాళ్ళని చుట్టేసుకుంటూ 'నాకు యిన్ని తపాకాలుకాలి తెత్తావుకదూ బావా' అన్నాడు బాబు తనదుఃఖాన్నంతా ఆమరుక్షణంలోనే మరిచి, అదోవిధమైన ఆనందాన్ని తన కళ్ళద్వారా వ్యక్తపరుస్తూ—

'అల్లానే తెచ్చిపెడతానులేబాబూ' అంటూ బయల్దేరాను బజారుకి—

ఆ మరుసటి రోజే దీపావళి కనక టపాకాల దుకాణాలపైన జనం కిటకిట లాడుతూవుంది. వొకదుకాణాన్ని

సమీపించి జన సమ్మర్దాన్ని తొలగించుకుంటూ కొట్టు యజ మానితో బేరమాడడం మొదలెట్టాను.

'అగ్గిపెట్టెలు ఎల్లా యిచ్చావు?'

'అయ్యా! వొక్క పైసా యిప్పించండయ్యా' అం టూ వొక బిచ్చకత్తె. చింకి బట్టలతో, దుర్వాసనలతో, నన్ను సమీపించింది.

" పైసా లేదు గియిసాలేదు వెళ్ళ"మని దానివైపు చూడకుండానే కసురుకున్నాను.

"దిక్కులేనిదాన్ని అయ్యా, బిడ్డోడికి వొక పైసా యిప్పించడయ్యా" మళ్ళీ ఆ బిచ్చకత్తె నన్ను యాచించటం మొదలెట్టింది.

"ఆవు త్తరక్షణంలోనే అమ్మా! నాకు టపాకాలే అన్న వాక్యం నాకు వినపడింది. చప్పుననేను వెనుదిరిగి చూచాను. ఆ బిచ్చకత్తె వాళ్ళోవున్న నల్లని కుర్రాడు అతృప్తనయనా లతో ఆకొట్టునంతా పరికిస్తూ అదేవాక్యాన్ని మళ్ళీ మళ్లీ ఉచ్చరించడం గమనించాను. ఎందుకో నాహృదయం వొ క్కుమ్మడిగా కలచినట్లయింది. తదేక ధ్యానంగా వొక్క మాటు ఆ కుర్రాణ్ని మళ్లీ పరికించాను. వాడి జాలిచూపులు ఆక్షణంలో నా హృదయాన్ని చీలుస్తున్నట్లు నాకుతోచింది. పాపం ఈ దౌర్భాగ్యపు దేశంలో ఎందరు బాలురు టపా

తాలు కావుగదా, పండుక్కి పట్టెడు అన్నమైనా లేకుండా మలమలమాడి పోతున్నారో!

చప్పున జేబులు తడిమి చూచాను. వొక్కటే వొక్కరూపాయి మునివేళ్లకిచల్లగా తాకింది. అనాలోచితంగా, ఆరూపాయతీసి ఆబిచ్చకత్తె చేతులో పెట్టాను.

ఆబిచ్చకత్తె తన కళ్లనే తానునమ్మలేక పోయింది. 'అయ్యా' అంటూ అది ఆరూపాయి నాచేతిలో పెట్టడానికి వొచ్చింది.

'పర్వాలేదు, తీసుకో', అంటూ అక్కడినించి చప్పున బయలుదేరా. ఇంట్లో వొక్కటే ఒక్కరూపాయివుంది.

పండుగముందు స్నేహితుల్ని ఎవరినీ బదులు అడగటానికి నాకు కించిత్తైనా మనస్కరించలేదు.

టపాకాలు లేకుండయింటికి వెళ్ళటం కూడా నాకు చాలా కష్టంగా తోచింది. విధిలేక పండుగ రెండురోజులూ మా మాధవుడి యింట్లో గడిపాను, యింటిలో మావాళ్ళెవరూ లేరన్న నెపంతో—

కాని, ఆ దీపావళి రెండు రోజులూ ఆ నల్లటి కుర్రాడిచూపులే నాకు మాటిమాటికీ జ్ఞాపకంరావడంమొదలెట్టాయి.

—o—